కథానిక:

అనామకుడు

శ్రీ మధురాంతకం రాజారాం

'ఏమండోయ్ రంగనాధంగారూ! బహుకాలదర్శనం. బావున్నారా?'

'అయ్యా నరహరీ! ఎప్పుడొచ్చావు బాబూ! ఇందాకా నిన్నుగురించే అనుకున్నాం. అన్నట్టు నువ్వొక్కడివేనా వచ్చింది?'

'ఒరేయ్ గోపీ! ఇదేనా రావడం? టిఫిన్లింకా పెడుతూనే వున్నారు. వెళ్ళు...వెళ్ళు...'

'రాధాపతీ! మెల్లగా దిగరా నాన్నా! అసలే మధ్య ఒళ్ళు చేసినట్టున్నావు. నీళ్ళపంపుల దగ్గర జాగ్రత్త! కాలుజారి ఎవరిపైన్నయినా పడ్డావో ప్రమాదం...'

పలకరింపులతో పరామర్శలతో పందిరిక్రింద సందడిగా వుంది. హారన్లు మ్రోగించుకుంటూ కార్లు, గంటలు వాయించుకుంటూ రిక్షాలు, గుర్రపు డెక్కల చప్పుళ్ళతో జట్కాలు, ప్రతి నిమిషమూ ఏదో ఒక వాహనం వచ్చి పందిరి ఎదుట విడిసిపోతోంది. ఎవరొచ్చింది, ఎవరొచ్చింది అన్నట్టుగా చూపులన్నీ కొద్ది క్షణాలపాటు ఒక్కుమ్మడిగా ఆ వచ్చి నిలిచిన వాహనంవైపు ప్రసరిస్తున్నాయి. కొత్తగా కొన్న పాతకారులోనుంచి దిగి మునిసిపల్ కౌన్సిలరు మేఘనాధంగారు యింతకు మునుపే లోపలికి వెళ్ళారు. ఆ కారుకు అల్లంతదూరంలో ఆగివున్న స్కూటరు ఇన్‌కమ్ టాక్సు ఆఫీసరు శ్రీధరమూర్తిగారిది. అదిగో, ఆ చెట్టుక్రింద పదిమంది మిత్రులతో పరివేష్టితుడై తీవ్రంగా ఏదో చర్చలో నిమగ్నుడైవున్న వ్యక్తి భూపతి. అతడు థియేటరు యజమాని. వీళ్ళేకాదు, పరకాయించిచూస్తే యింకా యిలాంటివాళ్ళెందరో అక్కడున్నారు. ఉండడంలో ఆశ్చర్య మేమీలేదు. జగన్నాధంగారు ఏకైకపుత్రికకు పెళ్ళిచేస్తున్నారు. ఆయన స్వహస్తంతో టౌనులో పంచిపెట్టిన ఆహ్వానపత్రాలే అయిదువందలదాకా వుంటాయి. అంతకు రెండింతల పత్రికలు పోస్టులో వెళ్ళాయి. జగన్నాధంగారికి భూములున్నాయి. భారీవ్యాపారాల్లో వాటాలున్నాయి. ఆఫీసుల్లో పలుకుబడివుంది. ప్రముఖులతో పరిచయంవుంది. జగన్నాధంగారి కిన్ని హంగులుండడంవల్ల అది ఆ ప్రాంతంలో చాలామందికి పిలవకపోయినా వెళ్ళవలసిన పేరంటమైపోయింది. ఇక పిలుపందుకున్న బంధుమిత్రులు తండాలు తండాలుగా తరలిరావడంలో ఆశ్చర్య మేముంది?

పెళ్ళికుమార్తె ప్రసూన యింకా కాలేజిలో చదువుకుంటూవుంది. పెళ్ళయినతరువాత ఆమె చదువుకోడానికి పెళ్ళికుమారుడు అభ్యంతరమేమీ చెప్పలేదు. ఆమాటకొస్తే ఆమె జీవితాంతందాకా చదువుకుంటూవుండిపోయినా తన కేమీ అసౌకర్యం వుండదన్నాడు. ఏప్రిల్లో యం యెస్సీ పరీక్షలు వ్రాసి మేనెల్లో పెళ్ళిచేసుకుంటున్న సీతాపతికిమాత్రం చదువులపట్ల ధ్యాస వెనుకముఖం పట్టిందనే చెప్పాలి. ఏసిద్ధినైతే లక్ష్యంగాపెట్టుకుని తానింతకాలం విద్యాసాధన చేశాడో అది ఈ పెళ్ళిద్వారా సగానికిపైగా సిద్ధించినట్టయింది. ఇప్పుడిక ఉద్యోగంచేసితీరాలన్న నిర్బంధంలేదు. 'కానీ చూద్దాం' అనుకుంటున్నాడు సీతాపతి. నచ్చిన ఉద్యోగమంటూ దొరికితే కొంత

కాలంపాటు చేసి చూడొచ్చు. మనస్కరించకపోతే చిరుగులుపడ్డ చేతిగుడ్డను గిరవాటు పెట్టినట్టుగా రాజీనామా వ్రాసి పడెయ్యనూ వచ్చు.

పెళ్ళికి ప్రసూన స్నేహితురాళ్ళు చాలామంది వచ్చారు. ఆ కాలేజీలో లెక్చరర్లుగూడా విచ్చేశారు. అందువల్ల ఆధునిక నాగరిక ప్రపంచంలో ఆడవాళ్ళ ఆహార్యకపు తీరుతెన్నుల్లో వచ్చిన వింత వింత సొబగు లన్నింటినీ ఒక్కసారిగా సంతకు తోలుకొచ్చినట్టుగా ఆ వివాహ దృశ్యాని కెక్కడలేని కాంతి వచ్చేసింది. ఈ విషయంలో వరుడైనా నిస్సహాయంగా లేడు. అతడి బలగంగూడా దండిగానే వచ్చింది. నవ్వులు, కేరింతలు, వాగ్యుద్ధాలు, సిగరెట్ల పొగలు ఎక్కడైతే దట్టంగా వ్యాపించి వున్నాయో అక్కడల్లా కాలేజీ కుర్రాళ్ళు గుమికూడి వున్నారని ఆ వైపు చూడకపోయినా తెలిసిపోతోంది.

ఏమైనా పెళ్ళికి వచ్చిన జనంలో మరింత వైవిధ్యం కల్పించడానికి తోడ్పడింది మాత్రం జగన్నాథంగారి బంధువర్గమే! నలుగు రన్నదమ్ము లాయనకు. వాళ్ళుగూడా నేల నాలుగు చెరగులా నాటిన నాలుగు జయస్తంభాలలాంటి వాళ్ళు. ఒకతను మిలిటరీ ఆసుపత్రిలో డాక్టరు. ఇంకొకతను రాయబార కార్యాలయంలో ఉన్నతోద్యోగి. తమ్ముడేమో ఐ.ఏ.యస్.లో వుండి నెల నెలా రెండువేల రూపాయలు పుచ్చుకుంటున్నాడు. అన్నగారు బొంబేలో హోటలు నడుపుతూ అక్కడే స్థిరపడ్డారు. పోగా జగన్నాథంగారి భార్యకు అన్నదమ్ములైతే ఒక్కడేగానీ అక్కచెల్లెళ్ళు అయిదుగురు. ఒకావిడ ఇంజనీరును పెళ్ళాడి అతడితో బాటుగా అమెరికావెళ్ళి రెండేళ్ళుండి యిటీవలే తిరిగొచ్చింది. ఇంకొకావిడ డాక్టరు. ఆమె మొగుడూ డాక్టరే! మిగిలిన వాళ్ళల్లో యిద్దరికి లెక్చరర్లకు పెళ్ళాలయ్యే యోగం పట్టింది. కడగొట్టు చెల్లెలి మొగుడుమాత్రం ఏకంగా శాసనసభలోనే సభ్యుడు. ఇప్పుడు పేర్కొన్న బంధువుల్లో చాలామందికి పెళ్ళిళ్ళయిన కొడుకులూ, కూతుళ్ళూ వున్నారు. ఆ రెండోతరంవాళ్ళకు మళ్ళీ బిడ్డలున్నారు. జగన్నాథంగారి కెలాగూ ఐశ్వర్యానికి తగ్గ నిష్పత్తిలో సంతానం కలగలేదు. భగవంతుడి కామాత్రం వితరణ లేకపోయింది. అందుకు బంధువు లేం చేయగలరు పాపం! వాళ్ళూ ఎంతోకాలంనుంచీ వేచివున్నారు. లేకలేక యిన్నాళ్ళకు జగన్నాథంగారి యింట్లో ఒక శుభకార్యం ఒనగూడింది. దీన్ని కాస్తా జారవిడిస్తే మళ్ళీ పాతికేళ్ళదాకా యిలాంటి అవకాశం యింకొకటి లభించకపోవచ్చు. అందువల్ల వాళ్ళు సకుటుంబంగా, మరికొందరైతే మిత్రసమేతంగా, యింకా కొందరు పరివారసహితంగా పెళ్ళికి తరలి వచ్చేశారు.

కామాక్షి కల్యాణ మహల్ సినిమాథియేటరు గాదు. లేకుంటే ఈపాటికెప్పుడో హౌస్‌ఫుల్ అన్న బోర్డు తగిలించివుండవలసింది!

హాల్లో పెళ్ళిమండపం ఎదుట వేసిన అయిదు వందల కుర్చీలు భర్తీ అయిపోయాయి. ఇంకా చాలా మంది ఎక్కడివాళ్ళక్కడే నిలబడిపోయివున్నారు. ముహూర్త సమయానికి అట్టే వ్యవధిగూడాలేదు. ఇంకొక అయిదువందల కుర్చీలకోసం మనుషులు పరుగెడుతున్నారు

ముఖంపైన క్రమ్ముకుంటున్న చిరుచెమటను అంగవస్త్రంతో తుడుచుకుంటూ జగన్నాథంగారు ఆదరాబాదరాగా పాకశాలవైపు పరుగుతీశారు.

ట్రిచీనుంచీ వచ్చిన వంటబ్రాహ్మల జట్టుకు నాయకుడు నటేశయ్యరు కుర్చీలో సుఖాసీనుడై, నోటినిండుకూ తాంబూలం పట్టించి, దానికి మద్దతుగా అప్పటికప్పుడే గంపెడు తంగభస్మం దట్టిస్తున్నాడు.

'అయ్యరుగారూ! అంచనా తారుమారైపోయేటట్టుంది. ముహూర్తం కాగానే కొందరు తాంబూలాలు పుచ్చుకునివెళ్ళి పోవచ్చుననుకోండి! కానీ నిలిచిపోయేవాళ్ళ పర్సంటేజ్ ఎక్కువగా ఉంటుంది. మీ రిప్పుడు చేస్తున్నది వెయ్యిమందికోసం. అవసరమైతే యింకొక అయిదువందల మందికిగూడా...'

'అదేయప్పా! మీరూరుకోండిమేసార్! ఇక్కడ

అడుగులమీద అండాలు మండుతుదా వుండును. అక్కడ అన్నాలు తినడందా ఆలస్యం, యిక్కడ అన్నాలు దిగుతూదా వుండును. మీకు కవలెందుకు పార్! పొండి, పొండి. మీవేలె మీరు సూసుకొండి...'

అయ్యరుగారి అభయ ప్రదానంతో ప్రాణాలు తెరిపిన పడ్డట్టయింది జగన్నాథంగారికి!

సరిగ్గా ఆ క్షణంలోనే వెనుకవైపునుంచి ఓచేయి జగన్నాథంగారి భుజంపైన పడింది.

కంగారు పడిపోతూ ఆయన వెనుదిరిగి చూచే సరికి హనుమంతప్ప కనిపించాడు.

'ఏమిటండీ అన్నగారూ! ఏం జరిగింది?'

'ఇప్పటికేమీ జరగలేదులే! రా, చెబుతాను...'

స్తంభం చాటుకు లాక్కెళ్లాడు హనుమంతప్ప.

'చూడవోయ్ జగన్నాథం! సీకూ యాభై యేళ్లు వచ్చేశాయనుకో! కానీ అదేమంత పెద్ద వయసుగాదు. సభలూ, సమావేశాలు, బిజినెస్సులూ వగైరా నువ్వు బోలెడన్ని జరిపించి వున్నావు. ఐనా పెళ్లిసంగతి వేరు. అందులోనూ కామాక్షి కల్యాణ మహల్లో పెళ్లి జరగడమాయె! ఇదసలే మాయా మహలు. ఏమూల ఏం జరుగుతున్నదీ మనం తెలుసుకోలేం. పోగా యిక్కడ మామూలుగా జరిగిపోయే తెరమరుగు వ్యవహారం ఒకటుంది...'

'అలాగా! అదేమిటో మీరే చెప్పాలి. పెద్దలు మీరుండడం అందుకే గదా!'

తన పెద్దరికం తనకు దక్కినందుకు హనుమంతప్ప ముఖంలో సంతృప్తి తాండవించింది.

'పెళ్లికి చాలామంది వచ్చారు. అవునా జగన్నాథం?'

ఇందులో అభిప్రాయ భేదానికి తావెక్కడి దన్నట్టు జగన్నాథంగారు తలపంకించారు.

'వస్తారు, వస్తారు. ఎందుకురారు! గరిట చేతబట్టుకుని విశ్వమోహిని అమృతం వడ్డిస్తున్నా నహో అనే సరికి దేవతలంతటి వాళ్లు బారులుతీర్చి కూర్చోలేదా? ఐతే ఒకటి. ఆ అయ్యలు చూచో వలసిందే! ఆయమ్మ వడ్డించనూ వలసిందే! కానీ రాహు కేతువుల మాటేమిటి? ముఖంచాటు చేసుకుని, చేతుల్నిమాత్రం పొడుగ్గా చాచుకుని బంతిలో బైటాయించిన రాహుకేతువుల్నిమాత్రం ఏబుద్ధిమంతుడూ కనిపెట్టలేదే!'

'అవు న్నిజమేనండీ అన్నగారూ! ఎందుకైనా మంచిది. మనం ఓ కంట కనిపెట్టివుందాం లెండి!'

'అదీ, ఆ హుషారు చాలా అవసరం! దారంట వెళ్లే దానయ్యలు చాలామంది వున్నారయ్యా లోకంలో. పైగా యిక్కడి సత్రాల్లో అరుగులపైన పస్తులు మాడే బైరాగులు బోలెడుమంది! వచ్చిన చిక్కేక్క డుందంటే, వీళ్లు చూడ్డానికి బైరాగుల్లా వుండరు. మామూలుమనుషుల్లా వుంటారు. ఇలాంటి పెళ్లిళ్లు జరిగాయంటే వాళ్లకు పండగ! ఒకమాదిరి వుతికిన బట్టలు తొడుక్కుంటారు. ముఖం శుభ్రంగా గీక్కుంటారు. చడీచప్పుడూలేకుండా పెళ్లివిడిదిలోకి వచ్చేస్తారు. పెళ్లివాళ్లతో కలిసిపోతారు. నర్కారెరువూ, చక్కెరా కలిసినట్టే! నోట్లో వేసుకుంటే గానీ రుచితెలియదు...'

'అవునవును. మీరు చెప్పేశారుగా! ఇక మన జాగ్రత్తలో మన ముందాంలెండి!'

'ఎందుకు చెబుతున్నానంటే జగన్నాథం, నిరుడిలాంటప్పుడు బెంగుళూరులో నా తోడల్లుడికూతురి పెళ్లి జరిగింది. మనోరంజనీ కళ్యాణమందిరం అని నువ్వూ వినేవుంటావు. జరిగితే ఏమైంది? పెళ్లికుమార్తె సూట్‌కేసు కనిపించలేదంతే! కొత్తచీరలు, నగలుఅంతా కలిసి యిరవైవేల రూపాయల సరుకు! తెల్లారేసరికి క్లోస్...'

అసలీ హనుమంతప్ప ధూమకేతువులాంటి వాడని జగన్నాథంగారికి తెలుసు! తోకచుక్క కనిపిస్తే దేశాని కరిష్టమట! తరతరాల విశ్వాసంకదా అని వూరుకోకుండా శాస్త్రజ్ఞులు దీన్ని మూఢ విశ్వాసంక్రింద జమకట్టారనుకోండి! కానీ ఎటొచ్చీ

పులికంటే గిలే హెచ్చు! జరగబోయే ప్రమాదంకన్నా (బహుశా అది జరగకనే పోవచ్చు) హనుమంతప్పచేసే ప్రమాదసూచనవల్లనే ఒళ్లు జలదరిస్తుంది.

హనుమంతప్పను తప్పించుకుని జగన్నాథంగారు మళ్లీ పెళ్లి జరుగుతున్న హాల్లోకి వచ్చేశారు.

పూలపల్లకీలా అలంకరించిన మండపంలో పురోహితుడు ముహూర్తధారణప్పుడు కావలసిన వస్తుసామగ్రిని ఓమూలగా పేర్చి పెట్టుకుంటున్నాడు.

పెళ్లి ఏర్పాట్లపైన తాను నియమించిన వలంటీర్లు కొందరు అప్పుడే తీసుకొచ్చివేసిన కుర్చీల లోకి అతిథుల్ని సర్దుతున్నారు.

'గంట తొమ్మిది కావస్తోందండీ శాస్త్రిగారూ! టంచనుగా పదికొట్టేసరికల్లా సూత్రధారణ జరిగి పోవాలి'—ఒక పెళ్లిపెద్ద హెచ్చరిక చేస్తున్నాడు.

కానీ అతిథిసత్తముల కెవరికీ ఆ ఆదుర్దా వున్నట్టులేదు. సూత్రధారణ జరిగేదీ, జరగక పొయ్యేదీ, మంగళవాద్యాలు మ్రోగేదీ మ్రోగకపోయేదీ, పురోహితుడి మంత్రాలు వినిపించేదీ వినిపించకపోయేదీ, ఈ గొడవేదీ వాళ్లకు కాబట్టలేదు. వేళకు సరిగ్గా తమ అవసరాలు తీరిపోతుండేపక్షంలో వాళ్లు ఎంత కాలమైనా యిక్కడుండి కులాసా కాలక్షేపంచేసి వెళ్లేధోరణిలో వున్నారు. జగన్నాథంగారికి కాస్త చిరాకు పుట్టుకొచ్చినమాట నిజం! కుర్చీలు చూపించినా వీళ్లు కూచోరు. అందుకిదే సందర్భమైనట్టు సినిమాలపైన, రాజకీయాలపైన ఏకధాటీగా ప్రసంగాలు కొనసాగిస్తారు. బహిరంగ సభలలోనైనా డిసిప్లిన్ మెయింటెయిన్ చెయ్యవచ్చునేమోగానీ, పెళ్లిళ్లలో అది సాధ్యమయ్యేటట్టులేదు...

అప్పుడొక చిన్న సంఘటన జగన్నాథంగారి కంటబడింది. ఎవడో ఒక అపరిచిత వ్యక్తి ఖాళీకుర్చీ ఒకటి వెదికిపట్టి, అందులో కూచోబోతుండగా ఎవరో దాన్ని వెనక్కు లాగేశారు జాగరూకుడుగా వుండబట్టి సరిపోయిందిగానీ లేకుంటే అతడు దబేలున నేలపైన పడిపోయివుండవలసిందే! నిలవరించుకుని అతడు తిరిగి చూచేసరికి ఒళ్లంతా పాంటుగా, కోటుగావున్న ఒక పెద్దమనిషి ఆకుర్చీలో ఆసీనుడై వున్నాడు. సంఘటన చిన్నదే అయినా అస్థాయిలో అక్కడొక చిన్నరగడ జరిగివుండవలసింది. కానీ అవ్యక్తి పెదవి కదలకుండా తనపాటుకు తాను దూరంగా వెళ్లిపోయి కిటికీదగ్గర నిల్చుండిపోయాడు.

జగన్నాథంగారికి ఆ అపరిచితవ్యక్తిపట్ల యించుక సానుభూతి కలుగక పోలేదు. కానీ హనుమంతప్ప చేసివున్న హెచ్చరిక మూలంగా ఆ సానుభూతి కొద్ది క్షణాల్లో అనుమానంగా మారిపోయింది. తాను కూర్చునేదాకా వచ్చిన కుర్చీని దురాక్రమణ చేసిన వ్యక్తిపైన కించిన్మాత్రంగానైనా కోపం రాలేదంటే యితడీ పెళ్లివేడుక పాలిటికి రాహువులాంటివాడే అయివుండాలి. ఇందులో పాల్గొనడానికి ఏమాత్రం చొరవగలిగి వుండినా అతడు ఆత్మాభిమానాన్ని చంపుకుని దూరంగా వెళ్లిపోవడం జరగదు. ఐనా యిప్పటికి మించిపోయిందేమీలేదు. గణిత శాస్త్రంలో తెలియని రాసిని 'ఎక్స్' అనుకోవడం పరిపాటి. ఆలెక్కన యితణ్ణి తాత్కాలికంగా ఎక్స్ అనుకోవచ్చు. పెళ్లి ముగిసేలోగా ఈ ఎక్స్ ఎవడయిందీ ఆరాతీయాలి...

తొమ్మిదిన్నరకు మంగళ వాద్యాలు మ్రోగ సాగాయి. రేపు పరీక్షలనగా బుద్ధిగా చదువుకోడానికి కూర్చునే కుర్రాళ్లకు మల్లే బంధుమిత్రులందరూ హాల్లో తావుచేసుకుని కూచున్నారు సకాలంలో సూత్రధారణగూడా జరిగిపోయింది. ఆ అవకాశం కోసమే వేచివున్నట్టుగా యువకు లిద్దరు తటాలున లేచి నిల్చున్నారు వాళ్ల చేతుల్లో రంగురంగుల కాగితాలున్నాయి. పంచరత్నాలు వ్రాసి తెచ్చిన యువకవి వోవైపున పెద్ద గొంతుకతో వాటిని చదువుతుండగా మరోవైపున ఈ యువకులు కాగితాలను పంచిపెట్ట సాగారు. ఆమాత్రం సంఘటనకే సభలో ఓమూల నుంచీ పెద్దగా కలకలం ప్రారంభమైంది. ఊరుకోం డూరుకోండని చేతితోనే సంజ్ఞచేస్తూ జగన్నాథంగారు సందడి చెలరేగుతున్న చోటికి దగ్గరగా వచ్చేశారు. అప్పుడొకచోట నేలపైన దండిగా మూగి

వున్న పాదరక్షల నడుమ రెండోసారి మళ్లీ ఎక్స్ ఆయనకు కానవచ్చాడు. కనిపించడంకన్నా అత డే స్థితిలో కనిపించాడన్నదే యిక్కడ ముఖ్యం. ఆశీర్వాద పద్యాల కాగితంకోసం అతడు చేతిని చూచాడు. యువకుడొక కాగితం ఆచేతిలోపెట్టి, తీరా పెట్టిన తర్వాత తల పైకెత్తి ఆ ముఖంలోకి చూచాడు. పద్యాలు చదవ గలిగిన పరిజ్ఞానం ఆ ముఖంలో కనిపించలేదేమో, అతడు వెంటనే ఆ కాగితాన్ని కాస్త లాక్కోబోయాడు. అవతలివ్యక్తిగూడా వీలయి నంతగట్టిగానే పట్టుకున్నాడేమో, యువకుడు వూడ లాగుకోజూడడంలో అది సర్రున ఏటవాలుగా చిరిగి పోయింది. సగంముక్కమాత్రమే చేతిలో మిగిలింది. ఆ ముక్కవైపు బిక్కుబిక్కుమంటూ చూస్తున్న ఎక్స్ జగన్నాథంగారికి కనిపించింది!

'అయ్యోపాపం' అనుకున్నారు జగన్నాథంగారు. ఎంతగా దండగతిండికోసం వచ్చినవాడైనా అతడి కిలాంటి పరాభవంమాత్రం జరగగూడదు!

ఆ తిండి తింటున్నప్పుడు అతడి వాలకాన్ని గమనించే అవకాశం సైతం జగన్నాథంగారికి లభించకపోలేదు. ఒక్కొక్కసారి నాలుగువందలమందికి చొప్పున మూడుసార్లు వడ్డించినతర్వాత రద్దీ తగ్గింది. నాలుగోసారికి డైనింగుహాల్లో సగం కుర్చీలు ఖాళీగావుండిపోయాయి. జగన్నాథంగారి ధ్యాసగూడా తిండిపైకి మళ్లింది. 'నాకూ నాలుగు మెతుకులు వడ్డించండి' అంటూ ఓ కుర్చీలో శరీరం చేరవేసిన జగన్నాథంగారికి నేరుగా అటువైపునవున్న వరుసలో ఓ కుర్చీలో కూర్చుని ఏ పదార్థాన్నిగానీ ఆవురావురుని తినేయకుండా చేతివేళ్లతో అన్నాన్ని కెలుకుతూన్న ఎక్స్ కనిపించాడు.

ఒకటికి రెండు అనుమానాలు బిగ్గరగా పట్టేసుకున్నాయి జగన్నాథంగారిని! తిండి బొత్తిగా సయించడంలేదంటే యితడు రెండోసారిఅయినా మళ్లీ తిండికోసం సిద్ధపడివచ్చివుండాలి. లేదా తిండికంటే మించిన గొప్పప్రయోజనం దేనికోసమో ఈ పెళ్లి విడిదిలో పొంచివున్నవాడైనా వాలి...

నిజంనిజం! జాగ్రత్త చాలా అవసరం. నిజాన్ని నిలకడమీదనే గ్రహించాలి...

అతిథులకు పట్టెనోటివిందుమాత్రమేకాకుండా కొంత కనులవిందు, వీనులవిందుగూడా కలిగేటట్టుగా జగన్నాథంగారు వివాహకార్యక్రమాన్ని రూపొందించారు. ఆనాటి రాత్రి ఎనిమిదేళ్ల అమ్మాయి ఒకతె చేసిన భరతనాట్యాన్ని వీక్షించడంకోసం పురప్రముఖులు చాలా మంది విచ్చేశారు. ఆ తరువాత ఒక చిన్నపాటకచ్చేరి గూడా ముగిసేసరికి గంట పదికావచ్చింది. మధ్యాహ్నం తిన్న ముహూర్తభోజనాలు అప్పుడే ఎలా అరిగి పోయాయోగానీ, అతిథులు మళ్లీ భోజనాలకు తయారు! నిర్వాహకుడి కొక్కడికి తప్పితే మిగిలిన వాళ్ళకందరికీ పెళ్లిళ్లు హాయిగావుంటాయి కాబోలు ననుకున్నారు జగన్నాథంగారు. అందరినీ భోజనాలకు వెళ్లమన్నారు. భోజనంచేసి వచ్చినవాళ్లను తాంబూలం వేసుకోమన్నారు. తాంబూల చర్వణం చేస్తున్నవాళ్లను వెళ్లి యిష్టమైనచోట పడుకోమన్నారు. ఇక ఆ వేళప్పుడు అన్నమేం దిగుతుందని కొద్దిగా ఉపాహారంమాత్రం తీసుకున్నారు.

గంట పన్నెండు!

గదిలోకివెళ్లి పడుకోవడమొక్కడేగాని జగన్నాథంగారికి నిద్రపట్టనేలేదు. కానీ యిప్పుడాయనకు ఎంతో ఆనందంగావున్నమాట వాస్తవం. భుజాలపైనుంచి కొండంతబరువును క్రిందికి దించివేసుకున్నట్టుంది. పెళ్లి అనేది వ్యక్తిగతవిషయం. పెళ్లి జరపడంలోతప్పితే పెళ్లికొడుకును ఎన్నుకోడంలో తన బాధ్యతేమీలేదు. నెలరోజులకుమునుపు సీతాపతి ఎవరో తనకు తెలియదు. ప్రసూనకతడితో రెండేళ్ల సుదీర్ఘ పరిచయం వుందట! ఒకరి నొకరు అర్థం చేసుకున్న తర్వాత తీసుకున్న నిర్ణయమే! కుర్రాడు బాగున్నాడు. బాగా చదువుకున్నాడు. బస్. తనకంతే కావలిసింది...

అలాగని తానీ విషయంలో యిల్లాలి అభిప్రాయాన్ని లెక్కకు తీసుకోకపోలేదు. నిజానికి ఈ సంబంధాన్ని ప్రతిపాదించింది ఆవిడే! బలపరచడం మాత్రమే తనవంతయిపోయింది. ఈడూ జోడూ

ఏంతో బాగుందట! అబ్బాయి, అమ్మాయి జంటగా ముందు నడిచి వెళ్తున్నప్పుడు వెనకనుంచి చూడ్డానికి వెయ్యి కళ్లు కావలసి వస్తాయట! ఆడవాళ్ల దృష్టిలో అల్లుడనిపించుకోదగ్గ మానవుడికి యిం తకుమించిన అర్హత అక్కర్లేదేమో!

ఒక ఆడబిడ్డకు వివాహ సంబంధం కుదర్చాలంటే మునుపు ఏడు జతల జోళ్లరిగిపోయేవట!

కాలేజీ లెక్కువై అబ్బాయిలు అమ్మాయిలు పరస్పరం ప్రేమించుకోడమంటూ ఒకటి ప్రారంభమైన తర్వాత యిప్పుడా బెడద చాలావరకు తగ్గిపోయినట్టేవుంది...

జగన్నాథంగారి పెదవులపైన లీలగా ఒక లేనగవు మెరిసింది.

గంట నాలుగు కొట్టేటప్పటికి జగన్నాథం గారికో విషయం జ్ఞప్తికి వచ్చింది. సింహద్వారం దగ్గర పోలుగాణ్ణి కాపుండమని చెప్పినట్టు గుర్తు. ఉన్నాడో లేదో? ఒకవేళ పనిచేసిన అలతలో ఒళ్లు మరిచి నిద్రపోతుంటే వుండిమాత్రం ఏం లాభం?

ఈ వూహ బుర్రలో మెదలగానే జగన్నాథం గారు లేచి చక్కా హాల్లోకి వచ్చేశారు. హాలుకు చుట్టూరావున్న గదుల్లో దేనిలోనూ దీపాలు వెలగడం లేదు. అందరూ నిద్రపోతున్నారన్నమాట! హాల్లో గూడా ఒక్కటే దీపం వెలుగుతోంది, నేలపైన పరిచిన బ్లాంకెట్లపైన పనిమనుషులు కొందరు అడ్డదిడ్డంగా పడుకుని నిండుగా ముసుగు పెట్టుకుని నిద్రపోతున్నారు.

వూలు వాడిపోయినా వాటి సువాసన ఇంకా గుమ్ముగుమ్ముగా గుబాళిస్తున్న ఆ హాల్లో కాసేపు కూచుందామనిపించింది జగన్నాథంగారికి!

గోడకానించి పెట్టివున్న కుర్చీని తీసుకొచ్చి ఆయన తనకు నచ్చినచోట వేసుకున్నారు.

కూర్చున్న కొద్ది సేపటి కాయనకు పెళ్లి మండపంపల్ల ఏర్పడివున్న నీడలో ఒక బెంచీ వేసి పడివున్నట్టు తోచింది. దానిపైన ఒకమనిషి పడుకున్న పోలికువగూడా గోచరించింది.

కప్పుకున్న బట్ట చిన్నది. అందువల్ల ఒళ్లు ముడుచుకోక తప్పలేదు. మోచెయ్యే తలగడగా ఉపకరించింది. ఏవిధంగా చూచినా అది నిద్రపట్టడానికి అనువైన సుఖశయ్య కానేకాదు.

కామాక్షి కల్యాణ మహల్లో వలభైరెండు గదులున్నాయి. పరుపులు, తలగడలు ఎన్నున్నాయో లెక్కేలేదు. ఏమాత్రం ప్రయత్నించి వుండినా ఈ మానవుడికొక పరుపు దొరికివుండేదే!

కానీ పెద్దలన్నట్టు, దేనికైనా అడిగివచ్చి వుండాలిగదా!

ఇంతవరకూ తెలిసిందిగాదు. ఇక్కడ దోమల విరవిహారంగూడా ఎక్కువగానే వున్నట్టుంది.

ఉండివుండీ ఒకదోమ అంట బొడవడంతో దురవస్థలాంటి అతడి నిద్రావస్థ మాటిమాటికీ చెదిరిపోతోంది.

అసలతడు నిద్రపోతున్నాడా అన్నదే సందేహం!

'ఏమండీ! నిద్ర పట్టడంలేదా?' జగన్నాథం గారు అప్రయత్నంగానే ప్రశ్నించేశారు.

'పరవాలేదు. ఒక్క రాత్రేగదా! ఎలాగో గడిచిపోతుంది...' మొత్తానికి నిద్రమాత్రం రాదన్న నిర్ణయానికి వచ్చిన వాడిలా అతడు లేచి కూచున్నాడు. లేచి కూర్చోగానే జగన్నాథంగారు అతణ్ణి పోల్చుకున్నారు.

ఇప్పుడిక ఏదైనా మాట్లాడకపోతే బాగుండదు. మాట్లాడ్డానికి యింకొక సబ్జక్టు ఎన్నుకోడమెందుకని ఆయన ఏకంగా కూపీలాగడానికే ఉపక్రమించారు.

'ఏ వూరండీ మీది?'

ప్రాసిక్యూటరు ప్రశ్నకు జవాబు చెప్పడానికి బొత్తిగా యిష్టం లేకపోయినా, చెప్పక తప్పించుకోలేని ముద్దాయిలా అతడు ముక్తసరిగా 'క్రొరపాడు' అన్నాడు,

'కొత్రపాడా! ఎప్పుడూ వినలేదే! ఏ జిల్లాలో వుంటుందండీ అది?'

అతడు జిల్లాపేరు చెప్పాడు. ఆంధ్రప్రదేశం లోని అన్నిజిల్లాలపేర్లూ జగన్నాథంగారికి తెలిసినవే! అందునా అతడిప్పుడు చెప్పినపేరు మరింత సుపరిచితం. పెళ్లికొడుకు సీతాపతి ఆ జిల్లావాడే!

ఐతే ఇతడు మగపెళ్లివారి తరపున మనిషై వుండాలి...

ఇప్పుడిక టాపిక్ మార్చవలసిన అగత్యం ఎదురైంది జగన్నాథంగారికి!

'మీ కీ యేడు వాన లెంతమాత్రం?'

'వానలవల్ల ఒరిగేదేమీ లేనప్పుడు అవి పడడము, పడకపోవడము రెండూ ఒకటే గదండీ?'

'అంటే? మీకు వ్యవసాయంలేదా ఏమిటి?'

'ఒకప్పుడుండేది...'

'ఇప్పుడు?'

'భూమిలో చాలాభాగం అమ్ముడైపోయింది. మిగిలింది తొండలు గుడ్లుపెట్టే మెట్టనేల. అది వున్నా లేనట్టే!'

'కావచ్చు. పల్లెటూళ్ళల్లో ఎందరో రైతులు ఎన్నోకారణాలవల్ల చితికిపోతుంటారు.'

'రోడ్ అండర్ రిపేర్'అన్న బోర్డుమచూచి మలుపుతిరిగిన కారులా జగన్నాథంగారి ప్రశ్న ఈసారి మళ్లీ విషయాంతరంలోకి వచ్చేసింది.

'బిడ్డలున్నారు గదండీ?'

'మొత్తం అయిదుగురు. ఇద్దరాడబిడ్డలకు పెళ్ళిళ్ళు చేశాను. మగబిడ్డల్లో యిప్పుడిద్దరు మాత్రమే వున్నారు...'

'అయ్యో పాపం!'

'అబ్బే, అలాంటిదేమీలేదు. ఒకడు లెక్కకు రాకుండాపోయాడనిమాత్రమే చెప్పాలి...'

'బలేగమ్మత్తుగా మాట్లాడుతారండీ మీరు! బ్లాక్‌మనీలా కన్నకొడుకు లెక్కకు రాకుండాపోవడమేమిటి?'

'అదంతేలెండి! వాడి కొక్కడికిమాత్రమే చదువు పట్టుబడుతూవచ్చింది. చనిపోతూ తల్లి గూడా వాడెందాకా చదువుకుంటాడో అందాకా చదివించమనే కోరింది. చదువులసంగతి మీ రెరుగుదురు. ఒక్కర్నాణ్ని చదివించడమంటే ఏనుగకు మేత అందించినట్టే! ఏడాది కొక కయ్యు అమ్మి వాడి చదువుపైన పెట్టవలసివచ్చింది...'

'పోనీలెండి! కుర్రాడు చదువుకున్నాడుగదా! ఏదైనా వుద్యోగం దొరికితే వాడు మిమ్మల్ని సాకకపోడు...'

ఎక్స్ నవ్వాడు—'ఈ దేశంలో మహరాజాలు బీదవాళ్లని సాకుతున్నారు. నౌఖర్లని సాకుతున్నారు. కడకు బిచ్చగాళ్లనిగూడా సాకేస్తున్నాచు. ఇక ఒక కొడుకు తండ్రిని సాకడంలో విడ్డూరం లేదు. కానీ తండ్రులందరికీ అలాంటి అదురుష్టం పడుతుందంటారా? నాకూ అరవయ్యేళ్ళు వచ్చేశాయి. ఇప్పటిదాకా ఒకరిమోచేతి గంజికోసం కక్కుర్తి పడలేదు. మిగిలిన కొద్ది రోజులుగూడా యిలాగే గడిచిపోతాయి...'

'అయ్యో పాపం! మీ మనసుకేదో పెద్దగాయమే తగిలినట్టుంది...'

అతడు పైకిలేచి బెంచీని జగన్నాథంగారికి దగ్గరగా జరుపుకున్నాడు. జేబులోనుంచి బాగా నలిగిపోయిన కాగితం ఒకటితీసి ఆయనచేత పెట్టాడు.

'ఏమిటండీ యిది?'

'ఇది వాడి పెళ్లి పత్రిక. పెళ్లి అయిదు రోజుల్లో వుందనంగా నాకందింది...'

'నా కెందుకు చూపిస్తున్నారో...'

'దాన్ని చదువుకునే టంతవరకూ చదువుకున్న వాణ్ని గాను. పైగా యింగ్లీషులో వుందాయె! ఎన్నిసార్లో తీసి చూచుకున్నాను. ఎందరికో చూపిం

చాను. ఎందరికి చూపించినా ఎన్నిసార్లు చదివించుకున్నా ఈ పెళ్లికొడుకు వాకొడుకే ననుకోడానికి యిందులో ఎక్కడా దాఖలా లేదు...'

తెల్లబోతూ జగన్నాథంగారు ఆ మునలివాడి ముఖంలోకి చూచారు. ఇదేమిటో అంతుతేల్చుకోవలసిన వ్యవహారంలాగే తోచిందాయనకు. 'ఉండండుండండి. కళ్లజోడు పెట్టుకుని దీనివైనమేమిటో తెలుసుకుంటాను...' అన్నారు.

ఇంతలో నటేశయ్యరు దగ్గరినుంచీ పిలు పొచ్చింది. ఫస్ట్‌రౌండుకాఫీ సిద్ధమైపోయిందట! మొదటికప్పు జగన్నాథంగారికేనంటే ఆయనకోసం ఎవరో పరుగెత్తుకొచ్చారు.

ముఖం కడుక్కుని కాఫీ సేవించాక ఆయనకు గుప్పిట్లో ఓ కాగితం నలిగిపోతున్న విషయం జ్ఞప్తికి వచ్చింది.

కళ్లజోడుమ అక్కడికే తెప్పించుకుని, పొట్లంలా మడిగిపోయివున్న కాగితాన్ని విప్పి ఆయన కంటికెదురుగా పట్టుకున్నారు.

వరుడిపేరు కంటబడేసరికి త్రుళ్లిపడ్డారు జగన్నాథంగారు. కన్యాదాతపేరు కనిపించేసరికి బుర్ర గిర్రున తిరగసాగింది. వధువుపేరు దగ్గరికొచ్చేసరికి సందేహానికి తావులేకుండా విషయం రూఢిగా తెలిసిపోయింది.

సదరు ఆహ్వానపత్రికను స్థూలంగా యిలా తెనుగులోకి అనువదించవచ్చు...

'ఫలానా తేదీన ఫలానాచోట జగన్నాథంగారి అమ్మాయి ప్రసూనతో జరుగనున్న నా వివాహానికి విచ్చేయ గోరుతున్నాను. ఇట్లు, సీతాపతి, ఎం.ఎస్సీ.'

ఒకవూరికి వెళ్లదలచుకుంటే దాని ఉనికి ఎక్కడో తెలుసుకోడం ముఖ్యం. ఉత్తరం సజావుగా చేరాలంటే చిరునామా సరిగ్గా వ్రాయడం ముఖ్యం. ఉనికి తెలియని వూళ్లకు మల్లే, చిరునామాలేని జాబులకు మల్లే కొందరు మనుషులుగూడా ఆకాశం నుంచి వూడిపడడం సంభవమా?

ఆయోనిజుడైన పక్షంలో తప్పితే వరుడిలా వ్యవహరించడంలో అర్థం లేదు.

దిగాలుపడిపోయి జగన్నాథంగారు చాలా సేపటి వరకూ అక్కడే కూర్చుండిపోయారు.

ఆయన మళ్లీ లేచి హాల్లోకి వచ్చేసరికి బెంచీ ఖాళీగా వుంది.

చేవమాని మొద్దులాల్లంటి యిద్దరు మనుషులెవరో ఆపాటికేవచ్చి పెళ్లిమంటపానికి వ్రేలాడుతున్న పూలదండల నన్నింటినీ తెంపి గంపల్లోకి ప్రోగుచేస్తున్నారు.

'పెళ్లయ్యా కాకమునుపే ఏమిటిది?' జగన్నాథంగారు కోపాతిరేకంతో గద్దించారు—

జగన్నాథంగారి కోపాన్ని లెక్కపెట్టకుండా వాళ్లు తమ పనేదో తాము సాఫీగా చేసుకపోసాగారు. లేదంటే ఆ యిద్దరిలో ఒక్కడుమాత్రం సహేతుకంగా సమాధానంచెప్పి ఆయన కోపాన్ని చల్లార్చడానికొక ప్రయత్నంమాత్రం చేశాడు—

'మరో పెళ్లివారు రాబోతున్నారండీ బాబుగారూ! ఆలోగా ఈ పని జరిగిపోవాలి...'

రెండోవా డందుకున్నాడు. 'వీటి కిక్కడ కంట్రాక్టుదారులం మేమేనయ్యా! పూలఏరువు బలే సత్తువలెండి! ఏ పైరుకువేసినా పంట యిబ్బడి ముబ్బడే!'